సాక్షి వరంగల్

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



ముగిసిన రాష్ట్రస్థాయిఅథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌ను ఖమ్మం జిల్లా కైవసం చేసుకుంది. - 8లో▸



చదువు.. క్రీడలు..

ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు కృష్ణవేణి కాంస్య పతకం సాధించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

32^0 /25^0

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

బీజేపీతోనే గ్రామీణ వికాసం



నల్లబెల్లి: గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్ రావు అన్నారు. పార్టీ పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో హర్ ఘర్ బీజేపీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. ప్రతి బూత్ కమిటీ అధ్యక్షుడు కనీసం 100 ఇళ్లను సందర్శించాలని చెప్పారు. కార్యక్రమంలో పార్లమెంట్ మాజీ సభ్యుడు అజ్మీరా సీతారాం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు తడుక వినయ్, మండల ప్రభారి ఎస్.శ్రీనివాస్, తరుక అశోక్‌గౌడ్, నాయకులు బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, అజ్మీర శ్రీనివాస్, తడుక అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు చేరుకోవాలి

ఎంజీఎం: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను చేరుకోవాలని వైద్యాధికారులు, సిబ్బందికి హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. నగరంలోని న్యూశాయంపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని ప్రాంతాల్లో డ్రైడే కార్యక్రమం అమలు, ఏఎన్‌సీ నమోదు, ఎన్‌సీడీ రీస్క్రీనింగ్, పాఠశాలలు, హాస్టళ్లలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మౌనిక, డెమో అశోక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

రామన్నపేట : వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవనంలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు సబ్ జూనియర్, కేడెట్ విభాగంలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు కైలాష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పోటీల వివరాలు వెల్లడించారు. సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొనే అభ్యర్థులు 2011, 2012, 2013వ సంవత్సరాల్లో జన్మించి ఉండి బాలుర విభాగంలో 30 నుంచి 66 కిలోల లోపు, బాలిక విభాగంలో 28 నుంచి 57 కిలోలలోపు ఉండాలని పేర్కొన్నారు. కేడెట్ విభాగంలో పాల్గొనే బాలురు 2008, 2009, 2010లో జన్మించి 50 నుంచి 90 కిలోల లోపు ఉండాలని, బాలికల విభాగంలో 40 నుంచి 70 కిలోల లోపు ఉండాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, సోమరాజు, దుపాకి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంచ నర్సింగరావుకు చేనేత అవార్డు

ఖిలా వరంగల్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డుకు ఎంపికైన కంచ నర్సింగరావును సోమవారం టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు అభినందించారు. నగరంలోని ఉర్సు కరీమాబాద్‌లో నర్సింగరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించారు. కంచ నర్సింగరావు తన ఇంట్లోనే అనేక రంగుల్లో కార్పెట్లను నేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. చేనేత కార్పెట్ల నేతలో నూతన ఒరవడితో వినియోగదారుల మన్ననలు పొందుతున్న నర్సింగరావు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. నిలువు మగ్గం మీద పంజా కార్పెట్‌పై 4 తాబేళ్ల బొమ్మలు నేసి రాష్ట్ర చేనేత, జౌళి శాఖ నుంచి ఆయన ప్రశంసలు అందుకున్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డుకు కంచ నర్సింగరావును ఎంపిక చేసింది. ఈనెల 7న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో జరిగే జాతీయ చేనేత దినోత్సవం వేడుకల్లో ఆశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా అవార్డుతోపాటు రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందుకోనున్నారు. కార్యక్రమంలో బాసాని కరుణాకర్, రాజశేఖర్, సమత పాల్గొన్నారు.

ఫీవర్రీనే..

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పెరిగిన జ్వరపీడితులు

- జూన్‌లో 684 కేసులు.. జూలైలో ఏకంగా 1,311 కేసులు
- 50కి పైగా డెంగీ కేసులతో ఆందోళన
- సీజనల్ వ్యాధులతో జనాల బెంబేలు
- అనధికారికంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వందల్లో కేసులు
- ఎంజీఎంలో రోగుల కిటకిట..

అమ్మో జ్వరాలు.. ఇంటింటికీ ఓ పేషెంట్.. ఏ ఆసుపత్రిలో చూసినా జ్వరపీడితులు.. జూన్‌లో వందల్లో ఉన్న జ్వరాల బాధితులు.. జూలైలో పదహేను వందలకు చేరువయ్యారు. అధికారిక లెక్కలే ఇలా ఉంటే అనధికారికంగా ఈ సంఖ్య మరింత ఎక్కువే. సాధారణ జ్వరాలతో పాటు డెంగీ కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఓ పక్క జ్వరంతో బాధపడుతున్న రోగులకు.. మరో పక్క ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లు గుండెదడ తెప్పిస్తోంది. మొత్తానికి పేద, మధ్యతరగతి రోగులు ఇటు జ్వరంతో, అటు ఫీజులతో 'యుద్ధం' చేయాల్సి వస్తోంది.



ఎంజీఎం ఆస్పత్రిలోని ఓ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

సాక్షి, వరంగల్:

ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణ మార్పులు, పారిశుద్ధ్యం అస్తవ్యస్తం, ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్న దోమల కారణంగా.. గత కొన్ని రోజులుగా జ్వరపీడితులు విపరీతంగా పెరిగిపోతున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. ఎంజీఎం ఆసుపత్రి వార్డులు వృద్ధులు, మహిళలు, పిల్లలతో కిక్కిరిసిపోతున్నాయి. జూన్, జూలై రెండు నెలల్లో రెండు జిల్లాల్లో కలిపి 1,995 ఫీవర్ కేసులు, 49 డెంగీ కేసులతో పాటు ఒక మలేరియా కేసు కూడా నమోదవడం కలవరపెడుతోంది. ఇవన్నీ ప్రభుత్వ అధికారిక గణాంకాలే. అయితే, ప్రైవేట్ కేసుల్లో ఇంకా వందల్లో జ్వరం కేసులు ఉన్నాయి. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ డాక్టర్లు అందినకాడికి ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా డెంగీ రోగుల నుంచి వరంగల్, హనుమకొండ నగరాల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఫీజులు వసూలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఎంజీఎంలో..

ఎంజీఎం: ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల నుంచే కాకుండా జ్వరపీడితులు ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి వస్తుంటారు. ఈ క్రమంలో జూన్ మాసంలో ఎంజీఎం ఆస్పత్రిలో 17 మలేరియా, డెంగీ 17 కేసులతోపాటు 119 మంది జ్వరపీడితులు అడ్మిట్ అయి చికిత్స పొందినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. జూలై మాసంలో మలేరియా15, డెంగీ 9 నమోదు కాగా, జ్వరంతో బాధపడుతూ అడ్మిట్ అయిన వారి సంఖ్య 265కు చేరుకుంది. ఇక ఓపీ సంఖ్య రోజూ వందల్లో ఉంటోంది.

నెల	జ్వరం	డెంగీ	మలేరియా
వరంగల్ జిల్లా			
జూన్	105	11	0
జూలై	421	15	1
హనుమకొండ జిల్లా			
జూన్	579	9	0
జూలై	890	14	0

ఓవైపు సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతుంటే, ఇబ్బడిముబ్బడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా ఉంచి వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవి పాటిస్తే ఆరోగ్యమే..

- ఇంట్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలి
- నీటి నిల్వ పాత్రలపై మూతలు పెట్టి దోమలు పెరగకుండా చూసుకోవాలి
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి
- వేడి ఆహారం తీసుకోవాలి
- కుళాయి నీటిని కాచి వడబోసి తాగితే మేలు
- మాంసాహారం తగ్గించాలి
- ఆకుకూరలకు బదులుగా కూరగాయలు తీసుకోవాలి
- బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి

ఈ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి



శరీరంపై ఎర్ర మచ్చలు రావడం, చెవుల్లో నుంచి రక్తం కారడం, మలమూత్ర విసర్జన చేసినప్పుడు రక్తం రావడం, యూరిన్‌లో రక్తం రావడం, ఒంటిపై దద్దుర్లు రావడం వంటి లక్షణాలు ఏమైనా ఉంటే ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. ఈ లక్షణాలతో బాధపడుతున్నప్పుడు రక్త పరీక్షలు చేసుకొని ప్లేట్‌లెట్లు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చాయని భయపడొద్దు. వ్యాధి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఉత్తమం. ఇంటి చుట్టూ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే దాదాపు దోమల బెడద నుంచి పూర్తిగా దూరమైనట్లే. దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఎంజీఎం ఫీవర్ వార్డులో జ్వర సంబంధిత వ్యాధుల నివారణకు చికిత్సలు అందిస్తున్నాం.

- డాక్టర్ కిశోర్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్

సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి



సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చేవారికి చికిత్సలు అందిస్తున్నాం. ఉచితంగా మందులు, పరీక్షలు చేస్తున్నాం. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న చోట అవసరమైతే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మలేరియా, డెంగీ దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నాం. దోమల నిర్మూలనతోనే వ్యాధుల నివారణ సాధ్యం అవుతుంది.

- డాక్టర్ సాంబశివరావు, జిల్లా వైద్యారోగ్య అధికారి, వరంగల్

సమయపాలన పాటించాలి



అర్జీదారు సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యశారద

- ఆలస్యంగా వచ్చిన అధికారులపై కలెక్టర్ సత్యశారద ఆగ్రహం
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ

న్యూశాయంపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఆలస్యంగా వచ్చిన అధికారులపై కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం పదిన్నరకే సమావేశ మందిరానికి వచ్చిన కలెక్టర్.. సమయానికి రాని అధికారులు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణికి మొత్తం 133 అర్జీలు రాగా, వాటిలో రెవెన్యూకు సంబంధించినవి 49 అర్జీలు, హౌసింగ్‌కు 34 దరఖాస్తులు రాగా, మిగితావి వివిధ శాఖలకు చెందిన వినతులు 50 వచ్చినట్లు అధికారులు వివరించారు.

స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మండల స్పెషల్ ఆఫీసర్లు ప్రతిరోజూ ఫీల్డ్ విజిట్ చేసి, సంక్షేమ పథకాల పురోగతి పరిశీలించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. నివేదికలు ఎప్పటికప్పుడు గూగుల్ స్ప్రెడ్ సీట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ముఖ్యంగా సంక్షేమ శాఖల పాఠశాలలు, హాస్టళ్లలో నాణ్యమైన విద్య, ఆహారం అందించడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రెడ్‌క్రాస్ సొసైటీలో మెంబర్‌షిప్ తీసుకోవాలి

రెడ్‌క్రాస్ సొసైటీలో మెంబర్‌షిప్ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. మెంబర్‌షిప్‌నకు నోడల్ అధికారిగా డీసీఓ నీరజ వ్యవరిస్తారని చెప్పారు. చేనేత లక్ష్మి స్కీం పథకంలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా అధికారులు అనురాధ, కల్పన, నీరజ, ఏఓ విశ్వప్రసాద్, చేనేతజౌళి శాఖ సహాయ సంచాలకుడు శ్రీకాంత్ రెడ్డి, టెస్కో డీఎంఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి



నా వయస్సు 11 సంవత్సరాలు. నేను దివ్యాంగురాలిని. నడక రాదు, మాట్లాడ లేను. పుట్టుకతోనే వికలాంగురాలిని. నాకు ఇప్పటి వరకు వికలాంగత్వం (సదరం) సర్టిఫికెట్ లేదు. అధికారులు దయచూపి పింఛన్ అందించాలి

- సనా, రంగశాయిపేట, వరంగల్

కళాకారుల పింఛన్ ఇప్పించాలి



నేను గతంలో రంగస్థలం, స్టేజి నాటకాలు, డ్రామా, సత్యహరిశ్చంద్ర, బ్రహ్మంగారి చరిత్ర వంటి పౌరాణిక నాటకాలు వేశాను. నా వయస్సు 84 సంవత్సరాలు. అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలి.

- డి.స్వామి, వల్లభ్‌నగర్, నర్సంపేట,

పత్తిచేనును ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

పాత కక్షలతో మాకు సంబంధించిన 20 గుంటల్లోని పత్తి చేనును కొంతమంది వక్తులు ధ్వంసం చేశారు. వారిపై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయాలి.

- మంజుల - మల్లయ్య దంపతులు, గురిజాల, నర్సంపేట



ధ్వంసమైన పత్తి చేను కొమ్మలతో కలెక్టరేట్‌కు వచ్చిన దంపతులు

లక్ష్యసాధనకు కృషి చేయాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ సత్యశారద


న్యూశాయంపేట: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 2025 - 26వ సంవత్సరానికి సంబంధించి ఆయా శాఖల వారీగా వన మహోత్సవంలో నాటాల్సిన మొక్కల లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. జిల్లా లక్ష్యం 31,40,272 కాగా, ఇప్పటివరకు 10లక్షల 87వేల 11 మొక్కలు నాటి, 9లక్షల 8వేల 272 మొక్కలకు జియో ట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. 5లక్షల 61వేల 115 మొక్కలు ఇంటింటికి పంపిణీ చేసినట్లు వివరించారు. కిచెన్ షెడ్స్, అశోక, బోగెన్విలియన్, ఉసిరి, కరివేపాకు, గోరింటాకు, కలబంద ముఖ్యంగా అవకాడో, వేప, రాల చెట్టు, జామ, సీతాఫలం మామిడి తదితర చెట్లను నాటాలని చెప్పారు. తదుపరి సమావేశం నాటికి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఇడియట్ ముచ్చట్లు చెప్పకు..!

- హౌసింగ్ ఏఈపై ఆగ్రహించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



విశ్వనాథపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: మండలంలోని కొమ్మాల, విశ్వనాథపురం, శాయంపేట హవేలి, మరియపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథపురం గ్రామంలో లబ్ధిదారుడు మూడు నర్సింహకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తూ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పది మందికి ఇళ్లు మంజూరు కాగా, నలుగురు మాత్రమే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించడంతో సంబంధిత ఏఈ వినోద్‌ను వివరణ కోరారు. అందులో ఒకరి ఆధార్ కార్డు మిస్ మ్యాచ్ కావడంతో జాప్యం జరిగిందని ఏఈ వివరణ ఇస్తుండగా, ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. 'నీ వయస్సు ఎంత' అని ఏఈని ప్రశ్నించగా.. 28 ఏళ్లు అని చెప్పాడు. ఇడియట్ ముచ్చట్లు చెప్పకు డీఈకి ఫోన్ చెయ్ అంటూ పరుష పదజాలంతో ఏఈపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ వచ్చిన 45 రోజుల్లో బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టాలని, లేకుంటే అవి రద్దవుతాయని అన్నారు. నిర్మాణాల విషయంలో జాప్యం జరిగితే పంచాయతీ కార్యదర్శి, సంబంధిత ఏఈలకు మెమోలో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కొమ్మాలలో కాంగ్రెస్ నాయకులకు చెందిన ఒకే కుటుంబానికి రెండు ఇళ్లు మంజూరైనట్లు స్థానికులు తెలపగా, జక్కుల రాజ్‌కుమార్, సాయిలి రమాదేవికి మంజూరు చేసిన ఇళ్లను వెంటనే రద్దు చేయాలని అధికారులను ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. కొమ్మాలలో ప్రజా గ్రంథాలయానికి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థలం కేటాయించాలని, సెర్ప్ మహిళా సంఘాలకు డైరీ ఫాం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎండీ.రియాజుద్దీన్, ఎంపీడీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శంకర్‌రావు, ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు దూల వెంటేశ్వర్లు, వీరాటి రవీందర్‌రెడ్డి, కూసం రమేష్, కొమ్ము శ్రీకాంత్, నాగరాజు, సాయిలి ప్రభాకర్, మూడు నర్సింహ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జక్కుల సరిత, సెర్ప్ సీసీ కోల శోభ, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు గట్టు రాధిక తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

222 మందికి మాత్రమే పంపిణీ

- నిరాశతో వెనుదిరిగిన పలువురు రైతులు
- జాతీయ రహదారిపై ఆందోళన
- బుధరావుపేట గోదాంకు మరో 888 బస్తాల యూరియా రాక



యూరియా కోసం గోదాంకు వచ్చిన రైతులు



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఖానాపురం: యూరియా కోసం రైతులకు కష్టాలు తప్పడంలేదు. సొసైటీ గోదాంల వద్ద బారులుదీరుతున్నారు. మండలంలోని బుధరావుపేటలోని గోదాం వద్ద యూరియా కోసం ఉదయాన్నే రైతులు బారులుదీరారు. గోదాంకు 444 బస్తాల దొడ్డు యూరియా ఆదివారం సాయంత్రం వచ్చింది. దీంతో బుధరావు పేట, మంగళవారి పేట, నాజీతండా, వేపచెట్టు తండాతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ఉదయమే గోదాంకు వచ్చారు. మహిళలు, పురుషులు వేర్వేరు లైన్లలో నిలబడగా, మొదటగా మహిళలకు అవకాశం లభించకపోవడంతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో పాటు యూరియాను కొంతమేర పంపిణీ చేసి నిలిపివేయడంతో రైతులు ఆగ్రహించారు. ఈ క్రమంలో ఎస్సై రఘుపతి అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పోలీసుల పహారా నడుమ ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 222 మందికి యూరియా పంపిణీ చేశారు. దాంతో యూరియా నిల్వలు అయిపోవడంతో మిగతా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరాశతో వెనుదిరిగారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు యూరియా కోసం భారీగా బారులుదీరారు. దీనికి తోడు పదిరోజుల నుంచి సొసైటీ పరిధికి యూరియా నిల్వలు రాలేదు. సోమవారం గోదాం వద్ద బారులుదీరినప్పటికీ యూరియా లభించకపోవడంతో బుధరావుపేట శివారులో జాతీయ రహదారి -365పై రైతులు రాస్తారోకో చేపట్టారు. జిల్లా అధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదంటూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో రైతుల వద్దకు వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎస్సై రఘుపతి వచ్చి యూరియా నిల్వలు వచ్చిన తర్వాత అందరికీ పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బాదావత్ బాలకిషన్ మాట్లాడుతూ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు బోడ కిషన్‌నాయక్, భిక్షపతి, బాలకిషన్, బాల, రమేష్, రాజు, మహిళా రైతులు మంగమ్మ, కేలోతు సరోజన, లావుడ్య సరోజన, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. కాగా, రైతుల ధర్నాతో స్పందించిన అధికారులు బుధరావుపేట గోదాంకు 888 బస్తాల యూరియాను సోమవారం సాయంత్రం దిగుమతి చేయించారు. ఆ యూరియాను మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి శ్రీనివాస్ వివరించారు.

వేయిస్తంభాల దేవాలయంలో శ్రావణ సోమవారం పూజలు



మల్లెపూల దండల అలంకరణలో రుద్రేశ్వరస్వామి

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో శ్రావణమాసంలోని ద్వితీయ సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీరుద్రేశ్వరస్వామి వారికి ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. 100 మంది భక్తులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు దేవాలయాన్ని సందర్శించి రుద్రాభిషేకం జరిపించారు. మధ్యాహ్నం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



బాలింతలకు అవగాహన కలిస్తున్న అధికారులు

నర్సంపేట రూరల్: అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలో గైనిక్ వార్డులను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందంగా ముస్తాబు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, ఐసీడీఎస్ సీడీపీఓ మధురమ హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగించాలని సూచించారు. ఈ పాలు శిశువుకు దివ్యౌషధంగా పనిచేస్తాయని చెప్పారు. ఈ పాలతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని తెలిపారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు కూడా అందించాలని చెప్పారు. ఇలా బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉండదని అన్నారు. అనంతరం ఆస్పత్రిలోని 25మంది తల్లులకు బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు. గైనకాలజిస్టులు, వైద్యులు నిర్మల, నవత, ప్రతాప్, సుభాన్, హెచ్ఈ వసంత, ఏఎన్ఎం కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఓపెన్ టు ఆల్ చెస్ విజేత అభినవ్‌సాయి

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సహకారంతో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో అభినవ్‌సాయి దామెర విజేతగా నిలిచాడు. ద్వితీయ స్థానంలో షేక్ రియాజ్, తృతీయ స్థానంలో విజయ చందర్‌రెడ్డి నిలిచినట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు.

క్లుప్తంగా

21న వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు


వాల్యా నాయక్, ఎన్నికల అధికారి

రామన్నపేట : వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నూతన పాలకవర్గ ఎన్నికకు ఈనెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహకార అధికారి ఎం. వాల్యా నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 8,11, 12 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 13న పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు, 21న పోలింగ్, పోలింగ్ అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని వివరించారు. ఫలితాల ప్రకటన తర్వాత మూడు రోజుల్లో ఆఫీస్ బేరర్స్ ఎన్నికల ఉంటాయని పేర్కొన్నారు. బ్యాంక్ పాలకవర్గంలో మొత్తం 12 మంది సభ్యులకు గాను ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి ఒక స్థానం, మహిళా కేటగిరీకి రెండు స్థానాలు, ఓపెన్ కేటగిరీకి 9 స్థానాలు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ కార్యక్రమం ఓ సిటీ రోడ్డులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో, పోలింగ్, ఓట్ల లెక్కింపు ఏవీవీ కళాశాలలో జరుగుతుందని వివరించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అదుపు తప్పిన బైక్..
ఫర్టిలైజర్ నిర్వాహకుడి దుర్మరణం


సాంబశివరావు (ఫైల్)

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామారం సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన సాంబశివరావు (46) స్థానికంగా లక్ష్మీ పేరుతో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం శనిగరంనుంచి హనుమకొండ వైపునకు బయల్దేరాడు. రామారం వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సాంబశివరావు అక్కడకక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎం మార్చురీలో భద్రపరిచిన సాంబశివరావు మృతదేహాన్ని ఫర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సాంబశివరావు కుటుంబానికి తమ అసోసియేషన్ అండగా ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న తెలిపారు. నివాళులర్పించిన వారిలో లెక్కల పున్నం చందర్‌రెడ్డి ఉన్నారు.

చదువు.. క్రీడలు..

ఏషియన్ పారా తైక్వాండో పోటీల్లో రీసెర్చ్ స్కాలర్ కృష్ణవేణి ప్రతిభ

● అభినందించిన వీసీ, రిజిస్ట్రార్


కృష్ణవేణిని సన్మానిస్తున్న వీసీ కె.ప్రతాప్, రిజిస్ట్రార్, రామచంద్రం, ప్రొఫెసర్లు


కాంస్య పతకం సాధించిన మాచర్ల కృష్ణవేణి

కేయూ క్యాంపస్: మలేషియాలో గత నెల30, 31తేదీల్లో నిర్వహించిన ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు మాచర్ల కృష్ణవేణి కాంస్య పతకం సాధించారు. భారతదేశం తరఫున పాల్గొన్న ఆమె ఇండియన్ పారా తైక్వాండో ప్రెసిడెంట్ వీణ చేతుల మీదుగా పతకం అందుకున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఎల్లగౌడ్ – హైమావతి దంపతుల కుమార్తె కృష్ణవేణి. తండ్రి ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. కృష్ణవేణి హనుమకొండ సుబేదారిలోని దివ్యాంగుల హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. తైక్వాండో పోటీలకు ఆన్‌లైన్‌లోనే ఈ.గణేష్ కోచింగ్ ఇస్తుండగా, జనగామలోని తైక్వాండో కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

ఆర్థిక సహకారంతో ఏషియన్ పోటీలకు..

మలేషియాలో ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు మాచర్ల కృష్ణవేణికి ఆర్థికపరమైన సమస్య ఏర్పడగా కాకతీయ యూనివర్సిటీ నుంచి అధికారులు రూ.25వేలు అందజేశారు. కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికాలోని ప్రవాస భారతీయులు, ఆ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎస్.శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ గిరిగౌడ్, డాక్టర్ అతికం శ్రీనివాస్‌గౌడ్ కలిపి రూ.1.40లక్షలు అందించారు. దాతల ఆర్థికసాయంతో ఏషియన్ పారా తైక్వాండో పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించిన కృష్ణవేణికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీల్లోనూ..

గతేడాది 2024లో కాంబోడియాలో నిర్వహించిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లోనూ బంగారు పతకం సాధించారు. అలాగే, గత మార్చిలో ఫస్ట్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్ షిప్‌లో కాంస్యపతకం సాధించారు. చిన్నప్పటినుంచి చదువుతోపాటు వివిధ క్రీడాపోటీల్లో పాల్గొంటున్న కృష్ణవేణి పారా సిట్టింగ్ వాల్‌బాల్‌లోనూ ప్రతిభ చూపుతున్నారు. 2021లో కర్ణాటక ఉడిపిలో జరిగిన జాతీయస్థాయి సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో, 2024 మార్చిలో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో, తమిళనాడు ఈరోడ్‌లో జరిగిన సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ చూపారు.

కృష్ణవేణి కామర్స్‌విభాగంలో పరిశోధకురాలు..

కాకతీయ యూనివర్సిటీలోనే కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పీజీ కోర్సు చేశాక మూడేళ్లుగా ఇదే విభాగంలో పరిశోధకురాలుగా పీహెచ్‌డీ చేస్తున్నారు. 'ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టివ్ ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఇండియా ఏ స్టడీ' అనే అంశంపై ఆ విభాగం ప్రొఫెసర్ నర్సింహాచారి పర్యవేక్షణలో పరిశోధన సాగిస్తున్నారు.

అభినందించిన వీసీ, రిజిస్ట్రార్

క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణిని సోమవారం యూనివర్సిటీలో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం శాలువా కప్పి సన్మానించారు. జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణవేణి క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తూ విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలుస్తున్నారన్నారు. ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.అమరవేణి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య, దివ్యాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు, తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్తొస్తూ అనంతలోకాలకు..

● బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు.. ఒకరి మృతి
● 13 మందికి తీవ్ర గాయాలు
● నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఘటన


మంగీలాల్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్/శాలిగౌరారం : శ్రీశైలం మల్లికార్జునస్వామి వారి దైవదర్శనానికి వెళ్తొస్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు చేరాడు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాబునాయక్ తండా, వినాయక తండా, పత్తిపాక ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, శాలిగౌరారం ఎస్సై సైదులు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయకతండా, బాబు నాయక్ తండా, పత్తి పాక ప్రాంతాలకు చెందిన 14 మంది తాపీ మేస్త్రీలు ఆదివారం ఉదయం ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శ్రీశైలం మల్లికార్జునస్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం వీరు తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. డ్రైవర్ గుండెపాక నవీన్ అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ 365వ నంబర్ జాతీయ రహదారిపై శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్టాడు. దీంతో ట్రావెల్స్ బస్సు రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న బానోత్ మంగీలాల్(42) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బానోత్ రమేశ్, బానోత్ లాలు, భూక్య సర్వం, అంబోతు శ్రీను, గుగులోత్ నరేశ్, భూక్య వీరన్‌కు తీవ్రగాయాలు కాగా.. మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే వారి కుటుంబీకులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను నల్లగొండ, నకిరేకల్, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన లచ్చిరాం, నరేశ్ మహబూబాబాద్‌కు తరలించి ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై సైదులు తెలిపారు.

పెళ్లి ఇంట్లో చోరీ..

బయ్యారం: పెళ్లి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు 5 తులాల బంగారం, 600 గ్రాముల వెండి, రూ. లక్ష నగదు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన అనగం రాధాకృష్ణ శనివారం తన కుమార్తె వివాహం మిర్యాలగూడలో జరగగా కుటుంబీకులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి, నగదు చూడగా కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తెల్లారేసరికి బూడిదే మిగిలింది!


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న బట్టల షాపు


దగ్ధమైన కరెన్సీ


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

● బట్టల షాపులో అగ్నిప్రమాదం
● రూ. 50 లక్షల మేర ఆస్తి నష్టం
● అగ్ని ప్రమాదానికి కారణం పాము..
● కన్నీరుమున్నీరవుతున్న బాధితులు

టేకుమట్ల: షార్ట్ సర్క్యూట్‌తో ఓ బట్టల షాపులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షాపు పూర్తిగా దగ్ధమై తెల్లారేసరికి బూడిదే మిగిలింది. దీంతో చేసేదేమీలేక బాధితులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ 2012లో టేకుమట్ల మండల కేంద్రంలో బట్టల షాపును ప్రారంభించి ఇక్కడే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 11 గంటలకు విద్యుత్ స్తంభంపైకి పాము ఎక్కడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించి షాపులో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన యజమాని శ్రీనివాస్ విద్యుత్ నిలిపి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. కానీ అప్పటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. దీంతో చేసేదేమీ లేక చుట్టుపక్కల వాళ్లను పిలిచి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. షాపు షెట్టర్ రాకపోవడంతో జేసీబీతో తొలగించారు. అలాగే, వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు వచ్చేసరికే షాపు మొత్తం కాలి బూడిదైంది.

మిగిలింది బూడిదే..

మండల కేంద్రంలో అర్ధరాత్రి మారుతి బట్టల షాపులో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఏ ఒక్క వస్తువు మిగులకుండా పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. 20 లక్షల నగదుతోపాటు షాపులో ఉన్న సుమారు రూ.30 లక్షల విలువైన స్టాక్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. వాటితోపాటు ఫర్నిచర్, కౌంటర్ ఏ ఒక్క వస్తువు కూడా మిగలకుండా కాలి బూడిదైంది. షాపు పైఅంతస్తులో ఉన్న కుటుంబ సభ్యులు ప్రమాద సమయంలో వెంటనే కిందికి రావడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ అగ్ని ప్రమాదంలో బూడిదే మిగిలిందని పొట్ట చేత పట్టుకుని మండల కేంద్రానికి వలస వచ్చిన శ్రీనివాస్‌తోపాటు కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎమ్మెల్యే గండ్ర పరామర్శ..

షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మండల కేంద్రంలోని మారుతి బట్టల షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం పరిశీలించారు. అనంతరం బాధితులను పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానన్నారు.

ఎగసిపడిన మంటలతో ఏం చేయలేకపోయాం..

షార్ట్ సర్క్యూట్ సంభవించిన కొన్ని నిమిషాల్లోనే షాపులో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మోటారు పైపు సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కళ్లముందే ఎగసిపడే మంటల్లో షాపు దగ్ధమవుతుంటే గుండెలు పగిలాయి. ఎంత ప్రయత్నించినా ఏం చేయలేకపోయా. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి షాపు పూర్తిగా దగ్ధమైనది. ఇప్పుడు నాకు మిగిలింది బూడిదే.

– శ్రీనివాస్, మారుతి బట్టల షాపు యజమాని

ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

అండర్-16 బాలికల విజేత హనుమకొండ

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు


లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారిణి


హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు


షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి


హ్యామర్‌త్రో విసురుతున్న క్రీడాకారుడు

వరంగల్ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ అథ్లెటిక్స్ అసోయేషన్ల ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్–14, 16, 18, 20 బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో 33 జిల్లాల నుంచి 1,400 మంది అథ్లెట్లు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు..

ఆయా జిల్లాల అథ్లెట్ల మధ్య హోరాహోరీగా సాగిన వివిధ పోటీల్లో ఖమ్మం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అండర్–18 బాలుర కేటగిరీలో మహబూబ్‌నగర్, బాలికల అండర్–18 విభాగంలో ఖమ్మం, అండర్–16 బాలుర విభాగంలో రంగారెడ్డి, అండర్–16 బాలికల విభాగంలో హనుమకొండ జిల్లా విజేతలుగా నిలిచాయి. ముగింపు వేడుకలకు ఆర్యవైశ్య సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చాంపియన్‌షిప్ కోసం పోటీలో పాల్గొన్న ప్రతీ అథ్లెట్ విజేతే అన్నారు. పతకం సాధించలేదని ఆందోళన చెందకుండా, మరోసారి బరిలోకి దిగి లక్ష్యం సాధించాలన్నారు.


అతిథుల చేతుల మీదుగా ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న ఖమ్మం క్రీడాకారులు


అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న హనుమకొండ క్రీడాకారులు

దేవాదుల వద్ద నాలుగు మోటార్లు పంపింగ్ నిలిపివేత

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం జీపీ పరిధిలోని గుట్టలగంగారం వద్ద గోదావరిపై ఉన్న జె. చొక్కారావు ఎత్తిపోతల వద్ద ఎనిమిది మోటార్లతో కొనసాగిన పంపింగ్‌లో సోమవారం ఫేజ్ త్రీలో నాలుగు మోటార్లను ఆఫ్ చేశారు. ఆదివారం వరకు పంపింగ్ వద్ద మూడు ఫేజ్‌లలో ఉన్న పదింటిలో ఎనిమిది మోటార్లతో కొనసాగించిన అధికారులు.. సోమవారం నాలుగు మోటార్లను ఆఫ్ చేసి ఫేజ్–1లో రెండు, ఫేజ్–2లో రెండు మోటార్లతో పంపింగ్ కొనసాగిస్తూ దిగువకు 8,48 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 75.80 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. టౌన్ ఎస్సై కె.శివ సిబ్బందితో కలిసి నర్సంపేట బైపాస్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి అనుమానాదాస్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు అతడిని ఆపగా, పారిపోయేందుకు యత్నించడంతో అదుపులోకి తీసుకుని విచారించి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా (రాజమహేంద్రవరం జిల్లాకేంద్రం) గోకవరం మండలం ఎస్సీపేట దేవీచౌక్ గ్రామానికి చెందిన గొర్రెల చిన్నబాబుగా గుర్తించారు. చిన్నబాబు గత మే 31వ తేదీన డోర్నకల్‌లో ఓ బైక్, మహబూబాబాద్‌లోని రామచంద్రాపురంలో 4.5 గ్రాముల బంగారు, 8 గ్రాముల వెండి ఆభరణాలు, ఆర్టీసీ కాలనీలో 4 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి పాల్పడగా ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వాటితోపాటు నర్సంపేట, కోదాడ పట్టణాల్లో కూడా రెండు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీసీఎస్ సీఐ హతీరాం, రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య, ఎస్సై ప్రశాంత్, సివిల్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంధువు దశదిన కర్మకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

● చెరువులో నీటమునిగి వ్యక్తి మృతి

ఎల్కతుర్తి: బంధువు దశదిన కర్మ అనంతరం స్నానం చేయడానికి చెరువులో దిగిన ఓ వ్యక్తి ఈత రాక నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో చోటు చేసుకుంది. ఎస్సై దివ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రి ఓదెలు(49) తన బంధువు ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన దశదిన కర్మ నిమిత్తం ఈనెల 3న చెరువు వద్దకు వెళ్లారు. కార్యక్రమం అనంతరం స్నానం చేయడానికి చెరువులోకి దిగిన ఓదెలు.. నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. ఈ విషయం కుటుంబీకులు గమనించలేదు. అనంతరం ఇంటివద్దకు చేరుకుని పలు చోట్ల వెతికినా ఓదెలు ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు (4వ తేదీన) తెల్లవారుజామున చెరువులో ఓదెలు మృతదేహం తేలి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. కుటుంబీకులు సమాచారం ఇచారు. దీంతో వారు చెరువు వద్దకు వెళ్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై దివ్య సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీశారు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి దారుణ హత్య

● మానుకోటలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్ కాలనీలో జరిగింది. టౌన్ ఇన్‌చార్జ్ సీఐ పి.సర్వయ్య కథనం ప్రకారం... లెనిన్ నగర్ కాలనీకి చెందిన తూళ్ల ప్రభాకర్ (35) చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూ ఉదయం ఇంటి నుంచి వెళ్లి చిత్తు కాగితాలు ఏరుకోవడం, ఏదైనా పని లభిస్తే చేయడం, రైళ్లలో శుభ్రం చేసి కొంత డబ్బులు సంపాదించుకుని రాత్రి ఇంటికి చేరుకుంటాడు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కూడా పని ముగించుకుని ఇంటికొచ్చి బయట కాలనీలోని రహదారిపై నిద్రించాడు. ఈ క్రమంలో దుండగులు ఆ యువకుడిని రాయితో తలపై మోది దారుణంగా హత్య చేశారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటనను చూసిన సంపతి శ్రీను అనే యువకుడు కాలనీ వాసులకు చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. జాగిలాలు, క్లూస్ టీంతో ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం మృతుడి మేనమామ వనగళ్ల గుట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య తెలిపారు. కాగా, మృతుడు ప్రభాకర్ తల్లిదండ్రులు, సోదరుడు గతంలో మృతిచెందగా అతడు కాలనీలో ఒంటరిగా ఉంటున్నాడు. అందరితో కలిసిమెలిసి ఉండే ప్రభాకర్ దారుణహత్యకు గురికావడం స్థానికులను కలచివేసింది. కాగా, ఉదయం నుంచి సంపతి శ్రీను కనిపించకపోవడంతో ప్రభాకర్ హత్యకు అతడే కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెంలో పని చేయమని తండ్రి మందలించాడని గడ్డి మందుతాగి కుమారుడు, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బల్వంతాపురం గ్రామంలో తల్లిదండ్రులు గొడవ పడుతున్నారని హోంగార్డు, జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామంలో మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపురం మండలం మర్రిపల్లిగూడెనికి చెందిన యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమిరె నర్సింహులు పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ (25) తల్లిదండ్రుల మాట వినకుండా స్నేహితులతో తిరుగుతున్నాడు. పని చేయకుండా ఎందుకు తిరుగుతున్నావని, ఏదైనా పని చేయమని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఆదివారం మద్యం తాగి అదే మత్తులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి విషయాన్ని బంధువులకు చెప్పాడు. వెంటనే నర్సింహులు తన బంధువులతో కలిసి రాజ్‌కుమార్‌ను వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

తల్లిదండ్రుల గొడవతో హోంగార్డు..


నాగరాజు(ఫైల్)

దుగ్గొండి : తల్లిదండ్రులు గొడవ పడుతున్నారని కలత చెందిన హోంగార్డు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బల్వంతాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన దానం మల్లేశం, విజయ దంపతులు వ్యవసాయం చేస్తు జీవిస్తున్నారు. ఈ క్రమంలో పంటలు పండక రూ.6 లక్షల వరకు అప్పుల య్యాయి. ఆదివారం సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కుమారుడు నాగరాజు (34) ఇద్దరికి సమాధానం చెప్పలేక విరక్తి చెంది గడ్డిమందు తాగి నిద్రించాడు. సోమవారం ఉదయం శ్వాసతీసుకోవడం కష్టం కావడంతో తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో తాను పురుగుల మందు తాగానని చెప్పడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, నాగరాజు దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌లో పదేళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వర్తించాడు. ఇటీవల బదిలీపై గీసుగొండకు వెళ్లాడు.

మద్యానికి బానిసై.. ఉరేసుకుని..


రాజు మృతదేహం

జఫర్‌గఢ్ : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై రామ్‌చరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బరబోయిన రాజు (39) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఉంటున్నాడు. ఎందుకు తాగుతున్నావని తండ్రి వెంకటయ్య మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రాజు.. వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.